క్లుప్తంగా

సిరులతల్లికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

వృద్ధుడికి నివాళులు


వృద్ధుడికి నివాళులు అర్పిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తదితరులు

అల్లిపురం: గత కొన్ని నెలలుగా ఏయూటీడీ భీంనగర్ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న కంతుల్తి సూర్యారావు (70) అనారోగ్య సమస్యలతో శుక్రవారం మరణించాడు. అతని జేబులో దొరికిన ఫోన్ నంబర్ ద్వారా కొడుకు ఎర్రబాబుకి సమాచారం అందించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. పోలీసు విచారణ అనంతరం పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న వారు, సిబ్బంది సూర్యారావుకు ఘనంగా నివాళులు అర్పించారు. బతికినంత కాలం భార్యాబిడ్డలను వదిలి తిరిగాడని, ఇప్పుడు అంతిమ సంస్కారాలు నిర్వహించుకునే భాగ్యం కలిగించిన ఏయూటీడీకి కొడుకు ఎర్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

సీజనల్ జ్వరాలపై అవగాహన


మహారాణి వీధిలో స్థానికులకు సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు మర్రిపాలెం పరిధి మహారాణి వీధిలో శుక్రవారం జోన్-5 మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో 'ఫ్రైడే-డ్రైడే'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ బోడ్డేపల్లి రాము పాల్గొని స్థానికులకు సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్రిజ్‌లు, సిమెంటు కుండీలు, పూల కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని మలేరియా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్తీక్, జనార్దన్, కిరణ్, మాధవరావు, శివకుమార్, గణేష్‌బాబు, శ్రీను, కనకరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

సీతంపేట: అక్కయ్యపాలెంలోని ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌ను శుక్రవారం ప్రార్థనా సమయంలో మండల విద్యా శాఖాధికారి రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఇళ్లు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌కు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతి సబ్జెక్టులో ప్రతి పాఠాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే పాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల గైడెన్స్‌లో ప్రతి ఒక్కరూ మంచి మార్కులు సాధించాలని ఎంఈవో ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి రాధా కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అంతటా.. డిజిటల్ లావాదేవీలే..

- చిల్లర సమస్యకు పరిష్కారం
- సమయం ఆదా
- అంతా ఫోన్‌పే బాట


జిలాబీ బండి వద్ద పేమెంట్ చేస్తున్న వినియోగదారుడు


పాన్‌షాప్ వద్ద పేమెంట్ చేస్తున్న కొనుగోలుదారుడు

అల్లిపురం: మీ జేబులో ఒక్క రూపాయి లేకపోయినా నో టెన్షన్.. మీ అకౌంట్లో డబ్బులు.. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. కావల్సిన వస్తువులు కొనుగోలు చేయవచ్చు. మొన్నటి వరకు పెద్ద పెద్ద మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు చిరు వ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండగా ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే కనిపిస్తున్నాయి. పెద్ద నోట్ల రద్దు తర్వాత డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించేవారు కాదు. పెద్దపెద్ద మాల్స్‌లో మాత్రమే క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు జరుగుతుండేవి. నగదు వేరే వారి ఖాతాలోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో నగదు రహిత లావాదేవీలు కనిపించేవి కావు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీల్లో గణనీయమైన మార్పు వచ్చింది. ఫోన్ పే గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే తదితర యూపీఐ ఆధారిత పేమెంట్ యాప్‌ల రాకతో అన్నిచోట్ల నగదు రహిత చెల్లింపులు పెరిగాయి. కిరణా, ఫ్యాన్సీ మందుల షాపులు, పెట్రోలు బంకులు.. చివరికి తోపుడు బళ్లపై కూరగాయలు విక్రయించే వారు సైతం ఫోన్‌పే వాడుతున్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతు బజారు, మహాత్మాగాంధీ మార్కెట్‌తో పాటు అల్లిపురంలో రాగి, ఇత్తడి, స్టీలు సామగ్రి షాపులు, హార్డువేర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వ్యాపారులు, టీ స్టాళ్లు, భోజన హోటళ్లు, తోపుడు బళ్లపై తిరుగుతూ చిరు వ్యాపారాలు చేసే వారితో పాటు చిన్నపాటి పండ్ల దుకాణాల నిర్వాహకులు కూడా ఆన్‌లైన్ చెల్లింపుల వైపే మొగ్గు చూపుతున్నారు. యూపీఐ యాప్‌లను వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరుసలో ఉంది.

చిల్లర సమస్యకు పరిష్కారం..

ప్రధానంగా చిల్లర సమస్యతో వ్యాపారాలు పోతుంటాయి. ఆన్‌లైన్ చెల్లింపుల పుణ్యమా అని చిల్లర సమస్య తీరడంతో చిరు వ్యాపారులు సైతం యూపీఐ పేమెంట్ల పట్ల ఆసక్తి చూపుతున్నారు. రూ.5, రూ.10, రూ.20 నోట్ల లభ్యత తక్కువగా ఉంది. రూ.2, రూ.3 వంటి చెల్లింపులు కూడా ఫోన్‌పేతో అవుతుండడంతో చిల్లర సమస్యకు పరిష్కారం లభిస్తోంది. క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసిన క్యూఆర్ కోడ్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.

ఆదమరిస్తే మోసాలకు ఆస్కారం..

ఆన్‌లైన్ చెల్లింపులు సౌలభ్యంతో పాటు మోసాలకు కూడా ఆస్కారం కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నరుకులు కొనుగోలు చేసిన తర్వాత అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేస్తుంటారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారునికి చూపించి జారుకుంటుంటారు. అయితే క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గానే దుకాణదారుడి ఖాతాలో ఎంత జమ అయిందన్న విషయాన్ని స్పీకర్ ఆడియో మెసేజ్ చేస్తోంది. దీంతో సెల్ ఫోన్ స్క్రీన్ మోసాలకు కొంత వరకు అడ్డుకట్ట పడుతుంది.



చిల్లర సమస్య దెబ్బ తీసేది..



ఖాతాదారులు ఎక్కువ మంది యూపీఐ ద్వారా నగదు చెల్లిస్తున్నారు. గతంలో ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే చిల్లర సమస్యతో వ్యాపారాలు జరిగేవి కావు. గతంతో పోలిస్తే యూపీఐ చెల్లింపులు పెరిగి.. చిల్లర సమస్య తగ్గింది.

– టి.మధు, చిల్లర షాపు నిర్వాహకుడు

పేమెంట్లు సులువుగా ఉన్నాయి..



క్యూఆర్ కోడ్ బాక్సులు వచ్చిన తర్వాత పేమెంట్లు సులువుగా జరుగుతున్నాయి. గతంలో మన అకౌంట్‌లో డబ్బులు కట్ అయినా వ్యాపారికి ఆ డబ్బులు చేరినట్లు మెసేజ్ వచ్చే వరకు వెళ్లనిచ్చే వారు కాదు. ఇప్పుడా సమస్య లేదు.

– బడే నాగరాజు, అచ్చియ్యమ్మపేట

అందరి సహకారంతోనే విద్యాభివృద్ధి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

దాబాగార్డెన్స్: అందరి సహకారంతోనే విద్యాభివృద్ధి జరుగుతుందని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు తెలిపారు. శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవా) ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీని ప్రముఖ వ్యాపారవేత్త పువ్వాడ శేషమస్తాన్‌రావు నిర్వహించారు. మస్తాన్‌రావు తల్లిదండ్రుల చేతుల మీదుగా 80 మంది పేద విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థి పువ్వాడ శేషమస్తాన్‌రావు కళాశాల అభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. శక్తి సంస్థ ద్వారా కళాశాల అధ్యాపకురాలు పైడి రజని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద విద్యార్థులను ప్రోత్సాహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో గురువెల్లి జాబిలి, అధ్యాపకులు ఎం.స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ అర్చన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న అజయ్, మీనాకుమారి దంపతులు

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన ఆర్.అజయ్, మీనాకుమారి దంపతులు సంపత్ వినాయగర్ ఆలయానికి రూ.లక్ష విరాళం శుక్రవారం ఆలయ వ్యవస్థాపక ఫ్యామిలీ మెంబర్ టీఆర్ బోస్‌కు అందజేశారు. అన్నప్రసాద పథకానికి రూ.50 వేలు, స్వామి మూల నిధికి రూ.50 వేలు అందించారు.

జగనన్న రాజ్యం రావాలి.. పేదల కష్టాలు తీరాలి

- కూటమితో కుంటుపడిన అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి


33వ వార్డులో జరిగిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలు విడుదల చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, బొల్లవరపు జాన్‌వెస్లీ తదితరులు

అల్లిపురం: జగనన్న రాజ్యం వస్తేనే పేదల కష్టాలు తీరుతాయని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయ కర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ చంద్రబాబు ఏడాదిన్నర మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రానికి వెన్నుముక అయిన 250 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడేలా చేశారని, పొగాకు, టమాటా, మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతుల కష్టాన్ని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారన్నారు. మహిళలకు ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్లకే పెన్షన్, భర్త చనిపోయిన మహిళలకి పెన్షన్లు వంటివన్నీ కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం పూర్తిగా కుంటిపడిందన్నారు. పార్టీ నూతన ఒరవడితో ఉత్సాహంగా బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము, సౌత్ బూత్ కమిటీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ బోరా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి, అంగనవాడి ఉపాధ్యక్షురాలు కొల్లి సత్యవతి, వార్డు ఉపాధ్యక్షుడు ఆడారి మహేష్, సభ్యులు హేమలత, బుర్రల చిన్న, సంతోష్, జిల్లా అనుబంధ సంఘాల మెంబర్ కష్టారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మీకాంతం, పోలవరపు పావని, సీనియర్ నాయకులు చంద్రకళ, బుడుగు శ్రీనివాసరావు, బుద్ధ గోపీకృష్ణ, కనితి బ్రహ్మం, భీశెట్టి దుర్గారావు, చోడిపిల్లి శివ, పులి, రంజిత్, శిరీష, మంగం పార్వతి, స్టేట్ సెక్రటరీ దశమంతుల చిన్ని, జిల్లా సెక్రటరీ అభిరెడ్డి ఆదివిష, శ్రీ ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణ, కార్పొరేటర్ బిపిన్ జైన్, పచేపల్లి రాము, వార్డ్ ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్, భీశెట్టి ప్రసాద్, దొడ్డి బాపు ఆనంద్, పీతల వాసు, ఆకుల ఏసు, దశమంతుల మాణిక్యాలరావు, కనకరెడ్డి, మహ్మద్ షకీల, సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు ఆకుల శ్యామ్, కొణతాల కష్ణవేణి, బాబుల్ శీను, కోటి, కోరాడ సురేష్, సాగర్, రాంరాజు, తమ్మినేని శ్రీను, చేపల నూకరాజు (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతం

- 32వ వార్డు కార్పొరేటర్ ఇంటి వద్దే స్పాట్
- అయినా స్పందన కరవు
- గాయపడుతున్న వాహన చోదకులు


గోతిలో దిగబడిపోయిన మినీ వ్యాన్ (ఫైల్)

అల్లిపురం: సాక్షాత్తు 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఇంటికి సమీపంలోనే వాహనాలు దిగబడిపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారంటూ వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది తవ్వి వదిలేసిన గొయ్యిని పూడ్చకపోవటంతో వాహన చోదకుల అవస్థలు వర్ణతాతీతం. ప్రతి రోజు వాహన చోదకులు గోతిలో పడి గాయాలు పాలవుతున్నారని వాపోతున్నారు. నేరెళ్లకోనేరు జంక్షన్ నుంచి సౌత్ జైలురోడ్డుకు వెళ్లే దారి అంధకారంతో నిండిపోవటంతో గొయ్యి కనిపించక రాత్రి సమయాల్లో మరింత ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాక్షాతు తన ఇంటి ముందు సమస్యను పరిష్కరించలేని కార్పొరేటర్ వార్డు సమస్యలు ఏం పట్టించుకుంటారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది స్పందించి తక్షణమే గోతిని పూడ్చాలని కోరుతున్నారు.

గురుదత్ చిత్రాలు ఆణిముత్యాలు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో హిందీ క్లాసిక్ చిత్రాల నటుడు, దర్శకుడు గురుదత్ శత జయంతి వేడుకల సమావేశం నిర్వహించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కాశీ విశ్వేశ్వరరావు, నరవ ప్రకాశరావు గురుదత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుదత్ చిత్రాల్లో మానవ సంబంధాలు, ప్రేమ, కుటుంబ వ్యవస్థ ఉంటాయని తెలిపారు. ఆయన చిత్రాలన్నీ నేటికీ ఆణిముత్యాలని, భాషతో సంబంధం లేకుండా అందరినీ అలరించేవని కొనియాడారు. ఆయన చిత్రాల్లో ముఖ్యంగా ప్యాసా, సాహిబ్, బీబీ ఔర్ గులాం, ఖాగజ్ కా ఫూల్ అపురూప క్లాసిక్స్‌గా గుర్తింపు పొందాయన్నారు. ప్రపంచ చిత్రాల జాబితాలో తప్పక గురుదత్ చిత్రాలుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణారావు, బి.చిన్నారావు, హుస్సేన్, బాబ్జి పాల్గొన్నారు.

కండక్టర్‌పై చర్యలకు డిమాండ్


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

దాబాగార్డెన్స్: దివ్యాంగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఏపీఎస్‌ఆర్‌టీసీ 69వ నంబరు బస్ కండక్టర్‌పై చర్యలు తీసుకుని న్యాయం జరపాలని విజువల్లీ ఛాలెంజ్డ్ యూత్ అసోసియేషన్ విశాఖ శాఖ ప్రతినిధులు మురళి, అప్పలరాజు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులు బస్సులో ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు సహాయంగా వారితో పాటు మరో వ్యక్తి ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం ఉచితంగా బస్‌పాస్ అవకాశం కల్పించిందని చెప్పారు. ఇటీవల కొంత మంది ఆర్టీసీ కండక్టర్లు తరచుగా దివ్యాంగులతో పాటు ఎస్కార్ట్‌ని బస్సులోకి ఎక్కనివ్వకుండా చేస్తున్నారని, ఒకవేళ ఎక్కినా బస్సులో నుంచి దించేస్తున్నారని తెలిపారు. తోడుగా మనిషి లేకపోతే చెయ్యి అందించాల్సిన బస్సు కండక్టర్లు, బస్సులో నుంచి నెట్టేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ నెల 11న అంధుడైన వీరుబాబుపై ఇటువంటి దాడే జరిగిందని, రైల్వేస్టేషన్ నుంచి ఆరిలోవకు వెళ్లే 69వ బస్సులో వీరుబాబు అనే అంధుడు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కితే ఆ కండక్టర్ బస్సు ఎక్కనివ్వకుండా అడ్డుకుని, ఈ బస్సు వెళ్లదని, ఇది ఆరిలోవ బస్సు కాదని అబద్ధం చెప్పి బస్సు ఎక్కించలేదన్నారు. 69వ నంబర్ బస్సులో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కండక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగ బద్ధంగా ఉన్న దివ్యాంగుల హక్కులు పరిరక్షిస్తారని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చర్యలు

సీతంపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాలో పని చేస్తున్న ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆశ కార్యకర్తల నుంచి వినతులు తీసుకుని, తమ స్థాయిలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని, రాష్ట్ర స్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారానికి వారికి పంపిస్తామని తెలిపారు. పని చేసే చోట ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్న ఉద్దేశంతో ఆశ గ్రీవెన్స్ మీటింగ్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌వో ఎం.సత్యవతి, డీసీఎం మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి శ్రావణమాస పూజలు


శ్రావణమాసం పూజల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 22 వరకు శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ వెంకట కామరాజు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో శ్రావణమాస ప్రత్యేక పూజల పోస్టర్ ఆవిష్కరించారు. శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాల్లో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రాతఃకాల ప్రత్యేకాభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం అమ్మవారికి ముత్యాల చీర అలంకరణ, మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణ, సామూహిక కుంకుమ పూజలు, 2వ శుక్రవారం అమ్మవారికి సువర్ణ వస్త్రాలంకరణ, 3వ శుక్రవారం అమ్మవారికి పట్టు వస్త్రాలంకరణ, 4వ శుక్రవారం అమ్మవారికి రజత వస్త్రాలంకరణ, 5వ శుక్రవారం అమ్మవారిని శ్రీలక్ష్మీదేవి రూపంలో అలంకరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు నాగవెంకట కమలశ్రీ, సహాయ కార్యదర్శి కట్టమూరి ప్రసన్న, కోశాధికారి దోమా వెంకట బాలాజీకుమార్, కడిమిశెట్టి దంతేశ్వరి, పాలూరి స్వర్ణలత, పూసర్ల అనిత, నేతి శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ, నూకేశ్వరరావు, చంద్రశేఖర్, సోమేశ్వరరావు, శివకుమార్, వరప్రసాద్, సత్తిబాబు, శ్రీనివాసరావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మస్తర్ల దందా..అడ్డుకునేదుందా?

- వార్డు కార్యాలయాల్లో చాప కింద నీరులా వ్యవహారం


జోన్-4 పరిధిలో ఓ వార్డు కార్యాలయం

జగదాంబ: జీవీఎంసీ జోన్-4 పరిధిలోని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాల్లో మస్తర్ల (హాజర్) విషయంలో కొత్తరకం దందా నడుస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-4 పరిధిలో 12 వార్డులున్నాయి. ఒక్కొక్క వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో సహా వార్డును బట్టి 35 నుంచి 75 మంది వరకు పారిశుధ్య కార్మికులు ఉంటారు. ఇందులో ఒక్కొక్క వార్డుకు 20 నుంచి 30 వరకు రెగ్యులర్ సిబ్బంది ఉంటారు. మిగిలిన వారందరూ ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరందరు ఇన్‌స్పెక్టర్ ఆధీనంలో పనులు చేస్తుంటారు. అయితే వివిధ కారణాల వల్ల నెలలో కొంత మంది పనికి రాకుండా మేనేజ్ చేసి జీతాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా రాని ఉద్యోగులందరూ ఆయా వార్డు ఇన్‌స్పెక్టర్లకు నెలకు కొంత రుసుం ఇచ్చుకుని హాజర్ మేనేజ్ చేసుకుంటున్నారని వినిపిస్తోంది. అలాగే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వద్ద నుంచి కూడా వసూళ్లు చేస్తున్నట్లు జోరుగా విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వల్ల పారిశుధ్య పరిరక్షణ మరుగున పడిపోతోందని పలువురు వాపోతున్నారు. ఇటువంటి చర్యలకు పబ్లిక్ హెల్త్ అధికారులు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

మాన్యువల్‌గా జీతాలు..

పారిశుధ్య సిబ్బంది జీతాలు మాన్యువల్‌గా పెట్టించి డ్రా చేస్తున్నట్లు చెబుతున్నారు. నెలనెలా డబ్బులు ఇవ్వడంతో వ్యవహారం అంతా గప్‌చుప్‌గా సాగిపోతున్నట్లు సమాచారం. దీంతో పారిశుధ్య కార్మికులు పనులు చేయకపోవడం వల్ల వార్డుల్లో పారిశుధ్యం క్షీణించిపోతోంది. జోన్ -4 పరిధిలో జగదాంబ, పూర్ణామార్కెట్, అల్లిపురం మెయిన్‌రోడ్డు, బీచ్ రోడ్డు, వన్‌టౌన్ ప్రధాన రహదారి మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తు ఇన్‌స్పెక్టర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటేనే దీనికి అడ్డుకట్ట పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

వార్డు కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాం. రిజిస్టర్లు పరిశీలించి సిబ్బంది విధులకు రాకుండా మస్తర్లు వేస్తున్నట్లు తెలిస్తే సంబంధిత ఇన్‌స్పెక్టర్, సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. అక్రమాలకు పాల్పడినట్టు రుజువైతే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కృష్ణంరాజు, జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో